క్లుప్తంగా

బూత్ కమిటీ జోనల్ అధ్యక్షుడిగా తల్లెం



ఓబులవారిపల్లె : రైల్వే కోడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తల్లెం భరత్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ జోనల్ అధ్యక్షుడిగా నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం తల్లెం భరత్ కుమార్ రెడ్డి గుంతకల్లు రైల్వే బోర్డు వినియోగదారుల కమిటీ సభ్యునిగా ఉన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి తనకు కేటాయించిన పదవి పట్ల అంకితభావంతో పనిచేస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానన్నారు.

ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు అర్బన్ : ప్రజలకు సేవలు చేస్తున్న ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం రూ.26 వేలు జీతం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే రికార్డులు అందించి ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు రత్నమ్మ, చెంగమ్మ, యశోద, మౌనిక, విజయమ్మ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పరిధిలో వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారితోపాటు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వేస్తామని హెచ్చరించారు.

నల్లగంగమ్మకు పూజలు



మహిమగల రాయిని మొక్కుకొంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో వున్న మహిమ గల రాయిని భక్తులు మొక్కుకున్నారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చర్చి చైర్మన్‌కు సన్మానం



బాబును సన్మానిస్తున్న ఆటోనగర్ సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని పురాతన లూథరన్ చర్చి చైర్మన్‌గా ఆటోనగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పాలెం బాబు ఎన్నికైనందుకు ఆదివారం ఆయనను ఆటోనగర్ అధ్యక్షులు లోకనాథం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూథరన్ చర్చికు మన సభ్యుడు బాబు ఎంపిక అవ్వడం సంతోషకరమని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామస్వామిరెడ్డి

సుండుపల్లె : చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని మర్రిచెట్టు ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో వైఎస్ఆర్‌సీపీ రాజంపేట నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్, సర్పంచ్ రామాజయచంద్ర ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు రామస్వామి రెడ్డి ప్రారంభించారు.

4న రాష్ట్ర బడ్జెట్‌పై సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

గంగమ్మా.. ఆశీర్వదించమ్మా..

రాయలసీమలోనే అత్యంత పెద్ద జాతరగా ప్రసిద్ధిచెందిన లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గంగమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు భక్తుల విశేష పూజలందుకున్న అమ్మవారు తిరుగుపయనమయ్యారు. అమ్మవారి జాతరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలవచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి జాగరణ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతికి ప్రదర్శనలు, చాందినీ బండ్ల ఉత్సవం కనుల పండువగా సాగింది. జాతర ఏర్పాటు చేసిన అంగళ్లు, చెరుకు విక్రయాల కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తిచూపారు. అలానే జాతరలో అక్రమంగా మద్యం విక్రయాలు, జూద క్రీడల వ్యాపారం విచ్చలవిడిగా జరిగింది. – లక్కిరెడ్డిపల్లె



జాతరకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



జాతరలో కొలువుదీరిన చాగల గుట్టపల్లె గంగమ్మ



అమ్మవారి సన్నిధిలో కడప మేయర్ సురేష్ బాబు, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి



మిఠాయి దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్న భక్తులు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు



జాతర ముగియడంతో తిరుగు ప్రయాణమైన చాగలగుట్టపల్లె గంగమ్మ



చెరుకు గెడలు కొనుగోలు చేస్తున్న భక్తులు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు





గంగమ్మ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఛాందినీ బండ్లు

గోకులం షెడ్ల నిధులు చెల్లించండి



దళవాయిపల్లిలో నిర్మాణమైన గోకులం షెడ్డు

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అయినప్పటికీ పాడి రైతులను ఆదుకుంటామని, అర్హులైన రైతులకు గోకులం షెడ్లను మంజూరు చేశారు. పుల్లంపేట మండలవ్యాప్తంగా 20 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. గోకులం షెడ్లను పూర్తి చేసి మూడు నెలలైనా ఇంతవరకు నిధులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఆర్భాటాలు ఎక్కువ, ఆచరించడం తక్కువ అన్న చందంగా కూటమి ప్రభుత్వం తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోకులం షెడ్లకు నిధులు వెంటనే మంజూరు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

రామాలయంలో అన్నప్రసాద వితరణ

రాయచోటి టౌన్ : పట్టణంలోని నిత్యాగరాజు వీధిలోని రామాలయంలో 17వ వార్షికోత్సవంలో భాగంగా ఉచితంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ ఉచిత అన్న ప్రసాద కార్యక్రమంలో శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని టీటీడీ పాలక మండలి మాజీ అధ్యక్షులు, సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.

వైభవంగా భోళా మల్లేశ్వరస్వామి కల్యాణం

నందలూరు : మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో వెలసిన శ్రీ భోళా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి సమేత భోళా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల శివనామ స్మరణల నడుమ కల్యాణ వేడుకను కనుల పండువగా జరిపించారు. ఈ కల్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో నందలూరు మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, వాలంటరీ వింగ్ నియోజకవర్గం అధ్యక్షులు భాస్కర్ యాదవ్, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మోదుగుల చంద్ర, హర్షవర్దన్ రెడ్డి, రాణా ప్రతాప్ రెడ్డి, మధు రాజు తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

భోళా మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పోటీలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జరిగిన పోటీలలో పోతిరెడ్డిపల్లికి చెందిన త్యాగంరెడ్డి లింగారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ. 30 వేలు నగదు బహుమతిని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. ద్వితీయ స్థానంలో పోతిరెడ్డి పల్లికి చెందిన చాగంరెడ్డి నాగేశ్వర్ రెడ్డి వృషభాలు నిలిచి రూ. 20 వేలు, మూడోస్థానంలో తాళ్లపాక గ్రామానికి చెందిన రేనాటి సాంబశివరాజు వృషభాలు రూ. 10 వేలు అందుక్నునారు. నాల్గోస్థానంలో పాత సంగటిపల్లికి చెందిన విశ్వనాథ రెడ్డి వృషభాలు రూ. 5 వేలు అందుక్నునారు. ఐదో స్థానంలో గుడిపాడు తుమ్మల నారాయణ రెడ్డి వృషబాలు నిలిచి రూ. 3 వేలు అందుక్నునారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి

సిద్దవటం : మండలంలోని టక్కోలు రైతుసేవా కేంద్రం పరిధిలోని దేగనవాండ్లపల్లి, ఖాజీపల్లె, కడపాయపల్లె, టక్కోలు గ్రామాలలో రైతుల సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు, బెండ, వరి, కూరగాయలు, ఆకు కూరలు, నువ్వులు, అలసందలు వంటి పంటలను ఆదివారం పరిశీలించినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెండ సాగును పరిశీలించి ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడం వల్ల రైతు నిమ్మకాయల ఓబులరెడ్డిని అభినందించామన్నారు. నీలం, పసుపు పల్లాలు కనీసం ఎకరాకు 20 చొప్పున అమర్చడం వల్ల రసం పీల్చు పురుగుల నివారించవచ్చన్నారు. కాకర పంటకు ద్రవ జీవామృతం తయారు చేసి రైతు శంకర్‌రెడ్డి వాడటం జరిగిందన్నారు.



బెండ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

ప్రొద్దు తిరుగుడులో శనగ పచ్చపురుగు, పొగాకు లద్దెపురుగు ఉధృతిని గమనించామని, దీని నివారణకు స్పైనోసాడ్ అనే పురుగు మందును లీటర్ నీటికి 0.3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే నువ్వుల పంటలో బూడిద తెగులును గమనించామన్నారు. దీని నివారణకు హెక్సాకోనజోల్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు లేదా మైక్లో బుటానిల్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతుకు తెలియజేశారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



అవార్డును అందుకుంటున్న విద్యార్థి పృథ్వీ

సుండుపల్లె : విశ్వం ఎడుటెక్ లాబ్స్ హైదరాబాద్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్, వేదిక మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో సుండుపల్లె వశిష్ట చైతన్య పాఠశాల విద్యార్థి ఒ.పృథ్వీ మొదటి బహుమతిని సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ కొండూరు రెడ్డయ్యరాజు ఆదివారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ్ మెమెంటో, రూ.5 వేలు నగదు బహుమతిని చెక్కు రూపంలో అందజేశారు. విద్యార్థి పృథ్వీని గణిత ఉపాధ్యాయురాలు అరుణకుమారి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రాజులను విశ్వం ఎడ్యుటెక్ లాబ్స్ రాయలసీమ మేనేజర్ అండర్ ట్రైనర్ ఎం.నాగార్జునలను ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను అభినందించారు.

‘ఆకేపాటిని విమర్శించే స్థాయి నీదా గన్నే’

ఆకేపాటిపై గన్నే సుబ్బనరసయ్య నాయుడు ఆరోపణలు ఖండించిన వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు

రాజంపేట రూరల్ : నిత్యం ప్రజల కోసం పరితపించే ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని విమర్శించే స్థాయి నీదా గన్నే సుబ్బనరసయ్యానాయుడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి మండిపడ్డారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ వివిద విభాగాల కన్వీనర్లతో కలసి పాపినేని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి హవాలో గెలిచిన ఆకేపాటి ప్రజాబలం నీకు గుర్తుకు రావటం లేదా అని ప్రశ్నించారు. విద్యార్థి దశ నుంచి ప్రజాసేవలో ఉన్న ఎమ్మెల్యేని నీ వంటి వారు విమర్శించటం సిగ్గుచేటన్నారు. ఆకేపాటిని రాజీనామా చేయమని చెప్పే అర్హత నీకుందా అని నిలదీశారు. ఆయన రాజీనామా చేస్తే ఆయనపై పోటీ చేసేందుకు కూటమి ప్రభుత్వంలో ఎవరు ఉండరని నిలదీశారు. మొన్న రాయచోటి నుంచి వలస తెప్పించుకొని భంగపడింది మరిచిపోయావా. ఇప్పుడు కూడా కడప నుంచో, నెల్లూరుకో వలస వెళ్లాల్సిందేగా. ఆకేపాటి కబ్జా చేశారని ఆరోపిస్తున్న మీకు చక్రాలమడుగు కనిపించటం లేదా. నీవు చేసిన కబ్జాలు నీకు కనిపించటం లేదా. గత 10 రోజుల నుంచి మీరు ఆకేపాటి మీద చేసే నీచ ఆరోపణలకు ఆధారాలున్నాయా? సహనం ఒక స్థాయి వరకే ఉంటుందని గుర్తుంచుకో. ఎమ్మెల్యే ఆకేపాటి తగాదాలు చేసే వ్యక్తి కాదు సౌమ్యుడు కాబట్టే మీరు ఎన్ని ఆరోపణలు చేసినా సహనంగా ఉన్నారన్నారు. సహనం హద్దు దాటే పరిస్థితులు మీరు తీసుకురావద్దని హితవు పలికారు. ఎమ్మెల్యే ఆకేపాటి మహిళలకు శ్రీమంతాలు, వందల మందికి కంటి చూపు తీసుకొచ్చిన ఘనత ఆకేపాటి కాదా అని ప్రశ్నించారు. ఆకేపాటి ఎస్టేట్‌లోని దేవాలయాల సముదాయంలో ఎంతో మంది పేదలకు తాళిబొట్టు అందించి ఉచితంగా వివాహాలు జరిపించేది నీకు కనిపించలేదా. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు పఠాన్ ఖాజామొహిద్దీన్, నియోజకవర్గ మేధావుల సంఘం అధ్యక్షులు బూసిరెడ్డి రాజశేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ దొడ్డిపల్లి భాస్కర్‌రాజు, నందలూరు మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, ఎంపీటీసీ ఎ.వరదరాజు, సీనియర్ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మూరీ గోవర్ధనరెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేడుకగా పాఠశాల వార్షికోత్సవం

సుండుపల్లె : మండల పరిధిలోని మాధురి స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలు స్కూల్ ఆవరణలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు మండల ప్రజల మధ్య అట్టహాసంగా జరిగాయి. స్కూల్ విద్యార్థులతో అనేక కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చినటువంటి అన్నమయ్య జిల్లా ఏఎస్పీ వెంకటాద్రి మాట్లాడారు. 1992వ సంవత్సరంలో ఇక్కడే ఎస్ఐగా మొట్టమొదటిసారిగా పనిచేశానని ఇక్కడ ప్రజలు నన్ను ఎంతో ప్రేమగా చూసుకొన్నారని తెలియజేశారు. మాధురి స్కూల్ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందని ఇక్కడ చదివే పిల్లలు మంచి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. ఎంఈఓ వెంకటేశ్వరనాయక్ మాట్లాడుతూ మాధురి స్కూల్ కరెస్పాండెంట్ గత 11 సంవత్సరాల నుంచి విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులతో పాటు పేద పిల్లలకు ఫీజులో రాయితీ, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత విద్యను ప్రతి సంవత్సరం ఇస్తున్నారని చెప్పారు. జబర్దస్త్ టీం ప్రదర్శనలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, ఎంఈఓ రవీంద్రనాయక్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

పది పరీక్షలలో విద్యార్థులు రాణించాలి

రాజంపేట రూరల్ : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో బాగా రాణించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని ఆకేపాటి అమరనాథరెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదివిన వాటిని గుర్తుంచుకొని పరీక్షలలో రాయలని కోరారు. మంచి భవిష్యత్‌కు ఈ పరీక్షలు పునాదని తెలియజేశారు. బాగా రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు అన్న ప్రసాదం అందజేశారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



వాలీబాల్ ఆడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర క్రీడలు, రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండిపల్లి క్రీడాకారులతో కరచాలనం చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

లక్కిరెడ్డిపల్లి : మండలంలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి జాతరలో దేవాలయ కార్యనిర్వాహక అధికారి అనుమతితో బాల్య వివాహాలు, బాలల లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణాపై రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ భానుజ మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం నేరమని, అందుకు సహకరించిన తల్లిదండ్రులు, బంధువుల పైన ప్రభుత్వం చట్ట ప్రకారం శిక్షతోపాటు జరిమానా విధిస్తారన్నారు. అలాగే బాల్య వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే సంతానం బలహీనంగా పుట్టడం, రక్తహీనత ఏర్పడటం జరుగుతుందని వివరించారు. అనంతరం సంస్థ కో–ఆర్డినేటర్ ఎల్లప్ప మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే 1098 కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం పిల్లలపైన లైంగిక వేధింపులు గురించి, అక్రమ రవాణ గురించి వివరించారు. కళాబృందం జానపద గేయాలు, నాటకరూపంలో ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసులు, రవీంద్రనాథ్, సంస్థ కార్యకర్తలు భారతమ్మ, మల్లిక, వెంకటయ్య, ఓబులయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఘనంగా బోనాల పండుగ

వీరబల్లి : మండలంలోని పెద్దవీటి పంచాయతీలోని కొత్తపల్లిలో నిర్వహించిన బోనాల పండుగకు ఆదివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని పెద్దవీడు పంచాయతీలోని కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, నాగిరెడ్డి, బాబురెడ్డిల పిలుపుమేరకు శనివారం ఎమ్మెల్యే, మండల నాయకులు హాజరయ్యారు. అనంతరం అల్పాహారంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడుతూ ప్రభుత్వం లేకపోయినా ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం కలిసి పోరాడాలన్నారు. జగనన్న మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలు, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణిరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



బోనాల పండుగకు హాజరైన ఆకేపాటి

జాతరలో సేవా కార్యక్రమాలు

గాలివీడు : మండల శాఖ విశ్వహిందూ పరిషత్ సభ్యులు లక్కిరెడ్డిపల్లి అనంతపురం గంగమ్మ జాతరలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనట్లు అధ్యక్షుడు బుక్కపట్నం హరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరలో నీటి ప్యాకెట్లను పంపిణీ చెయ్యడం, క్యూలో భక్తులను పంపడం వంటి విధులు చేసి జాతర సజావుగా నిర్వహించడంలో తమవంతు పాత్ర పోషించడం సంతోషంగా ఉందన్నారు. జాతరలో వాలంటీర్‌గా సేవలందించడానికి అవకాశం కల్పించిన ఆలయ ఈఓకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఇరగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుక్కపట్నం హరి

శ్మశానవాటిక మండపం ప్రారంభం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో నూతనంగా నిర్మించిన హిందూ శ్మశాన వాటిక మండపాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ జానకిరామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరం–1 గ్రామానికి చెందిన కీ.శే. ఉప్పల వెంకటేష్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఉప్పల బాబు, ఉప్పల మోహన్‌కుమార్ రూ. 10లక్షల నిధులతో మండపాన్ని నిర్మించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, 30వ వార్డు బూత్ కన్వీనర్ రామక్రిష్ణ, ఉపాధ్యాయుడు ఉప్పల వెంకటసుబ్బయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శుభ్రత పాటించాలి

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె, సిద్దవటం గ్రామాల్లో డీపీఓ పర్యటించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు ఆదివారం డీపీఓ రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొడిచెత్త, తడిచెత్త గృహిణులు ఇంటివద్దనే వేరు చేసి ప్రతిరోజు పురవీధుల్లోకి వచ్చే హరిత రాయబారులకు ఇవ్వాలని ప్రజలకు తెలియజేశామన్నారు. గ్రామాల్లో శుభ్రత పాటించి, అంటువ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల అభివృద్ధికి ఇంటి పన్నులు, నీటిపన్నులు బకాయిలు చెల్లించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, హరిత రాయబారులు, ప్రజలు పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

ఘన నివాళి

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని కొత్తపల్లి వడ్డిపల్లికి చెందిన వెంకటయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. వెంకటయ్య ఆదివారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణిరాజులు కలిసి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.